ఇంటింటా వైద్య సేవలకు మంగళం

- కూటమి ప్రభుత్వంలో ఒక్కొక్కటిగా పథకాలకు కోత
- గత ప్రభుత్వంలో ఇంటి వద్ద వైద్య సేవలు
- పథకాన్ని గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వం
- వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బందులు



పట్టణంలో వృద్ధురాలికి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

నిడదవోలు: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూర్చే ఒక్కొక్క పథకాన్నీ గాలికి వదిలేస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటి వద్దకే వైద్య సేవలు అందించే పథకానికి ప్రస్తుతం మంగళం పాడారు. దీంతో వైద్య సేవలు అందక వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు.

సమాజాభివృద్ధే లక్ష్యంగా నాడు సంక్షేమ పాలన

పేదలకు ఉచితంగా నాణ్యమైన విద్య, వైద్యం అందించగలిగితే సమాజం అభివృద్ధి చెందుతుందని భావించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన పాలనలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారు. ప్రధానంగా పేదలకు నాణ్యమైన వైద్య సేవలు ఇంటి వద్దకే అందించాలన్న సంకల్పంతో జగనన్న సురక్ష పేరుతో సేవా కార్యక్రమాలను నిర్వహించారు. వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, సచివాలయ ఉద్యోగులను ఇంటికి పంపించి వారికి అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించే కార్యక్రమాన్ని అమలు చేశారు. ప్రతి ఇంటికీ వైద్య సిబ్బంది వెళ్లి సేవలందించేవారు. ప్రతినెల తమ పరిధిలోని ఏరియాలలో నిపుణులైన వైద్యులు, సిబ్బంది వచ్చి 14 రకాల వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను రోగులకు ఉచితంగా పంపిణీ చేసేవారు. అత్యవసర వైద్య సేవల కోసం అవసరమైతే సమీపంలోని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ అమలులో ఉన్న కార్పొరేట్ ఆసుపత్రులకు తరలించేవారు.

జగనన్న ఆరోగ్య సురక్షలో నిపుణులతో వైద్య సేవలు

జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో నిపుణులైన వివిధ విభాగాలు చెందిన వైద్యులను రప్పించి గ్రామాల్లో, పట్టణాల్లో వైద్య శిబిరాలు నిర్వహించేవారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఈ సేవలు అన్నింటికీ మంగళం పాడింది. దీంతో అనారోగ్యం వస్తే ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వస్తుందని బాధితులు ప్రధానంగా వృద్ధులు వికలాంగులు వాపోతున్నారు. కొన్ని రోజులుగా ఎండలు విపరీతంగా పెరగడంతో పాటు వడదెబ్బతో పలు వ్యాధులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య నిర్వహణ సరిగా లేకపోవడం, దోమలు బెడద అధికమైన నేపథ్యంలో వృద్ధులు, చిన్నారులు వాంతులు, విరేచనాలు, జ్వరాల వంటి వ్యాధులతో బాధపడుతున్నారు. దీంతో ఆసుపత్రికి రాని వారి పరిస్థితి దయనీయంగా మారింది. దీంతో కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని పట్టించుకోకపోవడంతో పల్లె వైద్యం పూర్తిగా పడకేసింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి సచివాలయం పరిధిలో ఆరోగ్య సురక్ష పేరుతో వైద్య శిబిరాలు నిర్వహించేవారు. ఈ శిబిరాల ద్వారా వివిధ విభాగాల వైద్య నిపుణులతో ప్రతి నెల పరీక్షలు చేయించి అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అందించేందుకు కార్పొరేట్ ఆసుపత్రులకు రిఫర్ చేసేవారు. శిబిరంలోని గుండె సంబంధిత వ్యాధి రోగులకు ఈసీజీ తీసేవారు. దీర్ఘకాల వ్యాధులతో బాధపడే వారికి నాణ్యమైన వైద్య సేవలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. అయితే కూటమి ప్రభుత్వం ప్రస్తుత ప్రజల ఆరోగ్యానికి గాలికి వదిలేయడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

గతంలో ఇంటికి వచ్చి వైద్య పరీక్షలు చేసేవారు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతినెల ఇంటికి వచ్చి వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షల నిర్వహించేవారు. జగనన్న సురక్ష వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా మందులు అందించేవారు. కొన్ని నెలలుగా ఇంటికి వచ్చి వైద్య సేవలు అందించిన దాఖలాల్లేవు. పేదల ఆరోగ్యాన్ని పట్టించుకునే నాథుడు లేడు.ఇంటింటా వైద్య సేవలను కొనసాగించాలి.

– మీసాల మంగతాయారు, వైఎస్సార్ కాలనీ, నిడదవోలు

ఇబ్బందులు పడుతున్నాం



గతంలో ఇంటికి వచ్చి వైద్య పరీక్షలు చేసేవారు. వైద్య సిబ్బంది పరీక్షలు చేసిన తర్వాత అవసరమైతే మందులను ఇచ్చేవారు. ప్రస్తుతం ఇంట్లో ఎవరికైనా అనారోగ్యంగా ఉంటే ఆసుపత్రులకు వెళ్లలేకపోతున్నాము. కనీసం బీపీ, సుగర్ పరీక్షలు కూడా చేయడం లేదు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి అవసరమైన వైద్య సేవలను ఇంటికి వచ్చి అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– మామిడి వరలక్ష్మి, నిడదవోలు టౌన్

అక్రమ మట్టి తవ్వకాల నిలుపుదల



కాపవరంలో మట్టి తవ్వకాలను నిలుపుదల చేసిన రెవెన్యూ అధికారులు

పెరవలి: మండలం పరిధిలో అక్రమంగా మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పొలాల్లో మట్టిని తవ్వుతున్నామంటూ పక్కనే ఉన్న కాలువ గట్లను కొల్లగొట్టి మట్టిని తవ్వి తరలిస్తూ రియల్ ఎస్టేట్ లే అవుట్లను మెరక పనులకు విక్రయించి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై అక్రమంగా మట్టి తవ్వకాలు శీర్షికతో 'సాక్షి'లో ఈనెల 10న వెలువడిన కథనంపై రెవెన్యూ అధికారులు స్పందించారు. మంగళవారం రాత్రి పొక్లయినర్లను వారు అడ్డుకుని మట్టి తవ్వకాలను నిలుపుదల చేసారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం అక్రమార్కులపై చర్యలు తీసుకుంటారో లేక వదలివేస్తారో వారికే ఎరుక. బరితెగించిన మట్టి మాఫియా అధికారుల కళ్లెదుటే మట్టిని తవ్వి ట్రాక్టర్లపై తరలించారు. అధికారుల చర్యలతో మట్టి తవ్వకాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. మట్టి తవ్వకాల అక్రమాలను వెలుగులోకి తీసుకువచ్చిన సాక్షిని స్థానికులు అభినందించారు. దీనిపై తహసీల్దార్ డి.అచ్యుతకుమారిని వివరణ అడగగా మట్టి తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదని అందుకే నిలుపుదల చేసామని తెలిపారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరపల్లి: దేవరపల్లి సెక్షన్ పరిధిలోని దుద్దుకూరులో గురువారం ఆర్డీడీఎస్‌లో భాగంగా నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ నిడదవోలు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు గ్రామంలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

రేపు విద్యుత్ నిలుపుదల

గోపాలపురం: గోపాలపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సత్యసాయి ఇండస్ట్రియల్ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5గంటల వరకూ విద్యుత్ నిలుపుదల చేస్తామని నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.నారాయణ అప్పారావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

బాలాత్రిపుర సుందరి అమ్మవారికి అభిషేకాలు



ఉండ్రాజవరంలో ప్రత్యేక అలంకరణలో బాలాత్రిపుర సుందరీ దేవి

ఉండ్రాజవరం: జేష్టమాసం పౌర్ణమి సందర్భంగా ఉండ్రాజవరంలోని బాలా త్రిపుర సుందరి సమేత గోకర్ణేశ్వర స్వామి ఆలయంలో బాల త్రిపుర సుందరి అమ్మవారికి బుధవారం తెల్లవారుజామున పంచామృతాలతో వివిధ రకాల పళ్ల రసాలతో అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారికి సహస్ర నామ కుంకుమ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

గరుడ వాహనంపై ఊరేగిన శ్రీవారు



దేవరపల్లిలో గరుడ వాహనంపై ఊరేగుతున్న వేంకటేశ్వరస్వామి

దేవరపల్లి: జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా దేవరపల్లిలో వేంచేసిన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి బుధవారం గరుడవాహన సేవ నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు స్వామి వారికి అర్చకులు పూజలు నిర్వహించారు. అనంతరం గోవింద నామస్మరణతో భక్తులు స్వామి వారిని గరుడ వాహనంపై మాండవ వీధుల్లో ఘనంగా ఊరేగించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారి సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గరుడవాహన సేవ నిర్వహించారు.

విద్యార్థులకు బస్ పాసులు సిద్ధం

నిడదవోలు: ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా పట్టణంలో ఆర్టీసీ డిపో వద్ద ఈనెల 14 నుంచి విద్యార్థులకు కొత్త బస్ పాసులు అందజేస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యార్థులు తమ పూర్తి వివరాలు ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. డిపో వద్ద ఏర్పాటుచేసిన కౌంటర్ వద్ద బస్ పాస్ పొందేందుకు దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డుల జెరాక్స్, టెన్త్ మార్కుల జాబితా, స్టడీ సర్టిఫికెట్ జెరాక్స్‌లు తీసుకుని రావాలని డిపో మేనేజర్ పేర్కొన్నారు.

రైతే దేశానికి వెన్నెముక



జగన్నాథపురంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా నాగలికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం: రైతే దేశానికి వెన్నెముక అని దేశంలో 75 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్నారని, రైతు బాగుంటే అభివృద్ధి వేగవంతమవుతుందని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని జగన్నాథపురంలో బుధవారం వ్యవశాయ శాఖ ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి నిర్వహించారు. జిల్లా వ్యవశాయశాఖ అధికారి ఎస్ మాధవరావు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం సబ్సిడీపై ఎరువులు విత్తనాలు అందజేస్తుందని తెలిపారు.అనంతరం సబ్సిడీపై రైతులకు డ్రోన్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఏడీఏ పి చంద్రశేఖర్, ఏవో బి రాజారావు, నాయకులు రొంగల సత్యనారాయణ, జేష్ట శ్రీదర్, కాట్రగడ్డ సురేష్, దొడ్డిగర్ల సువర్ణరాజు, పసుమర్తి గంగాధర్, కాకర్ల రామతులసి, కొర్లపాటి రాము,పోశినగణపతి రైతులు పాల్గొన్నారు.

రైతులు నీటి తీరువా బకాయిలు చెల్లించాలి



పైడిమెట్టలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు సమస్యలను చెబుతున్న గ్రామస్తులు

తాళ్లపూడి: ఎత్తిపోతల పథకం ఆయకట్టు రైతులు సకాలంలో నీటి తీరువా బకాయిలను చెల్లించి సంఘాలు సక్రమంగా పనిచేయడానికి తమ వంతు సహకారం అందజేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని పైడిమెట్ట ఎత్తిపోతల పథకం ద్వారా ఖరీఫ్‌కు సాగు నీటిని బుధవారం ఆయన విడుదల చేసారు. ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు ఎత్తిపోతల పథకం వద్ద పూజలు నిర్వహించి మోటార్ల స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎత్తిపోతల పథకాల మోటార్లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని అన్నారు. రైతుల ధాన్యం బకాయిలు సకాలంలో అందజేస్తామని తెలిపారు. రూ.3 కోట్ల నిధులతో కొవ్వాడ కాలువ ఆధునీకరణ పనులను చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు గుళ్లపూడి రామచంద్రం, తహసీల్దార్ మోహన భారతి, ఎంపీడీవో టీబీ వెంకటరమణ, ఇరిగేషన్ డీఈ గురవయ్య, ఏఈ సురేంద్ర, నాయకులు కాకర్ల సత్యేంద్ర, కొర్లపాటిలక్ష్మణరావు, ఇందుగుల రామకృష్ణ, గన్నిన సత్తిబాబు, కొప్పాక కోటేస్ పాల్గొన్నారు.

పైడిమెట్టలో సీసీ రోడ్డుకు ప్రారంభోత్సవం

పైడిమెట్టలో రూ.20 లక్షలతో నిర్మాణం చేసిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు, ఆర్డీవో రాణి సుస్మితతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు మహిళలు డ్రెయిన్ సమస్య పరిష్కరించాలని, తాగేందుకు గోదావరి నీటిని అందించాలని కోరారు.

లయన్స్ కంటి ఆసుపత్రి సేవలు అభినందనీయం



డాక్యుమెంట్లను మంత్రి కందుల దుర్గేష్‌కు అందజేస్తున్న లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ కొత్తపల్లి రవికుమార్

నిడదవోలు: రాజేశ్వరీ రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యశాల సేవలు అభినందనీయమని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పట్టణంలోని లయన్స్ కంటి ఆసుపత్రి యాజమాన్యం రూ.1.45 కోట్ల విలువైన 1,345 గజాల స్థలం మున్సిపాలిటీకి బహూకరించారు. ఈ సందర్భంగా బుధవారం సంబంధిత డాక్యుమెంట్లు కంటి ఆసుపత్రి చైర్మన్ కొత్తపల్లి రవికుమార్ మంత్రి కందుల దుర్గేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ త్వరితగతిన గాంధీనగర్ రోడ్డు నంబర్- 1 నుంచి మూలకోడు చెరువు వరకు రోడ్డు నిర్మించాలని మున్సిపల్ అధికారులకు ఆయన ఆదేశించారు. త్వరలోనే మురుగునీటి శుద్ధి కర్మాగారం, ఇందిరానగర్‌కు రోడ్డు వేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండ్ కింద సమాజానికి ఉపయోగపడే బృహత్తరమైన కార్యక్రమం చేపట్టిన శ్రీమతి రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యశాల, లయన్స్ క్లబ్ యాజమాన్యాన్ని మంత్రి దుర్గేష్ అభినందించారు. గాంధీనగర్ రోడ్డు నంబర్- 1 నుంచి మూలకోడు చెరువు వరకు రోడ్డు వేసేందుకు కావలసిన స్థలాన్ని కొనుగోలు చేసి మున్సిపాలిటీకి గిఫ్ట్ డీడ్ రూపంలో అందించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్మన్ షేక్ వజీరుద్దీన్, మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, లయన్స్ నేత్ర వైద్యశాల చైర్మన్ కొత్తపల్లి రవికుమార్, లయన్స్ క్లబ్ సభ్యులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి కృషి

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో క్రీడాభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్ అన్నారు. బుధవారం స్థానిక నారాయణపురంలో రూ.3.41 కోట్లతో నిర్మించిన ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను శాప్ చైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్యే శ్రీనివాస్, ఎమ్మెల్సీ వీర్రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ దోహదపడుతుందన్నారు.

పంట కాలువలకు మోక్షం



ముక్కామల చానల్‌లో తవ్వకాలు చేపట్టిన పొక్లయినర్

పెరవలి: పంట కాలువలు పూడుకుపోయి అస్తవ్యస్తంగా తయారవడంతో పెరవలి మండలంలోని రైతులు సాగు నీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై ఈ నెల 7వ తేదీన సాక్షిలో 'అధ్వానంగా కాలువలు–ఆందోళనలో రైతులు' శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఇరిగేషన్ అధికారులు స్పందించి కాలువల తవ్వకాలు చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా కాలువల తవ్వకాలు చేపట్టకపోవడంతో పాటు, అడుగడుగునా కాలువ గట్లు ఆక్రమణలకు గురికావడంతో పాటు పూడుకుపోయాయి. దీనితో కాలువ దిగువ భూములకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలువల ద్వారా సాగునీరు సక్రమంగా అందక కేవలం ఖరీఫ్ పంటకే తప్ప రబీ పంట మొత్తం బోర్లపై ఆధారపడి సాగు చేస్తున్నామని రైతులు మొరపెట్టుకుంటున్నారు. దీంతో ఇరిగేషన్ అధికారులు ఈ కాలువల్లో పూడిక తొలగింపునకు నిధులు మంజూరు చేయించడంతో పాటు కాలువ తవ్వకాల పనులు వేగంగా చేపట్టారు. దీనితో పెరవలి పరిధిలోని గరప కాలువ, పేకేరు చానల్, ముక్కామల చానల్ పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టారు. పేకేరు కాలువ తవ్వకాలకు రూ.6.75 లక్షలు, గరపకాలువ తవ్వకాలకు రూ.5.03 లక్షలు, ముక్కామల కాలువ పనులకు రూ.4.52 లక్షలు నిధులు మంజూరు చేసి వెంటనే తవ్వకాలు చేపట్టారు. ఒకవైపు కాలువలకు నీరు వదలివేయడంతో తవ్వకాలు పూర్తవుతాయా అని రైతుల ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఇరిగేషన్ ఏఈ ఎస్ బాలమురళీకృష్ణ మాట్లాడుతూ నిధులు మంజూరు కావడంతో పాటు తవ్వకాలకు అనుమతులు రావడంతో పనులు చేపట్టామని తెలిపారు. రైతులు సహకరిస్తే పనులు వేగవంతంగా పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. ప్రస్తుతానికి మూడు కాలువల్లో పనులు చేయటానికి నిధులు మంజూరయ్యాయని చెప్పారు.



పెరవలిలో గరప కాలువలో పొక్లయినర్‌తో పూడిక తవ్వకాలు

ప్రతి మండలంలో ఈసీఆర్పీ భవనాలు నిర్మాణం

పెరవలి: ముందు జాగ్రత్తగా ప్రతి మండలంలో ఎమర్జెన్సీ కోవిడ్ రెస్పాన్స్ పాయింట్ (ఈసీఆర్పీ) భవన నిర్మాణాలు చేపట్టామని, ఇందులో 6 పడకల గదులు ఉంటాయని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా నియోజకవర్గంలో రూ.31 కోట్లతో రహదారులు నిర్మాణాలు చేపట్టామని ఆయన తెలిపారు. పెరవలి మండలం ఖండవల్లిలో రూ.68.50 లక్షలతో నిర్మించిన అంతర్గత రహదారులను ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం కొన్ని రోడ్లకు శంకుస్థాపనలు చేసారు. అనంతరం కానూరు పీహెచ్‌సీలో రూ.9.83 లక్షలతో నిర్మించిన ఈసీఆర్‌పీ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంతి, స్కిల్ డవలప్‌మెంట్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు, జనసేన అధ్యక్షుడు పిప్పిర రవి, టీడీపీ అధ్యక్షుడు అతికాల శ్రీనివాస్ ఎంపీడీఓ పద్మజ, తహసీల్దార్ డి అచ్యుతకుమారి పాల్గొన్నారు.

సేవ చేయడమే ధ్యేయంగా పని చేయాలి

ఉండ్రాజవరం: ప్రజలకు సేవా చేయడమే ధ్యేయంగా ఆరోగ్య సిబ్బంది పని చేయాలని ఏపీ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. ఉండ్రాజవరం పీహెచ్‌సీలో రూ.50 లక్షల నిధులతో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి దుర్గేష్, రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు మాట్లాడారు. ఈ సందర్భంగా జూన్ 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పాలంగికి చెందిన రిటైర్డ్ ఆంగ్ల భాష అధ్యాపకుడు కోట రామప్రసాద్ రచించిన యోగా గేయ ప్రతులను వారికి అందజేశారు. కోట రామప్రసాద్‌ను మంత్రి దుర్గేష్, శేషారావు అభినందించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు ఆర్ఎస్ఎస్‌వీ ప్రసాద్, ఆర్.ఉషాదేవి, ఎంఈవో సీహెచ్.సత్యనారాజు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు గజ్జవరపు వెంకటేశ్వరరావు, సర్పంచ్ మెండె వెంకట్రావు పాల్గొన్నారు.

సమిశ్రగూడెం పీహెచ్‌సీ వద్ద ..

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం పీహెచ్‌సీ వద్ద రూ.9.83 కోట్లతో నిర్మించిన 6 పడకల ఎమర్జెన్సీ కోవిడ్ రెస్పాన్స్ పాయింట్ (ఈసీఆర్పీ) శిలాఫలకాన్ని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ బుధవారం ప్రారంభించారు. త్వరలోనే నిడదవోలులోని సామాజిక ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా తీర్చుదిద్దుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు, సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్నప్రియాంక, ఎంపీడీఓ జగన్నాథరావు, తహసీల్దార్ బి.నాగరాజునాయక్, స్థానిక నాయకులు ఉప్పులూరి రామ్మోహన్‌రావు, గోగిన శ్రీనివాసరావు, ఎండీ అక్రం, పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా

నిడదవోలు: గృహ అవసరాల వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పట్టణంలోని తీరుగూడెంలో ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏపీ టిడ్కో నిధులతో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ టిడ్కో విద్యుత్ ఉప కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఈ సబ్‌స్టేషన్ ద్వారా నిడదవోలులో కొంత భాగంతో పాటు ఆంజనేయపురం, సింగవరం, తీరుగూడెం ప్రాంతాలకు నిరంతరాయంగా కరెంట్ ఇచ్చే అవకాశం ఉందన్నారు. స్థానికంగా టిడ్కో ఇళ్లు పూర్తయితే వాటికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. 3 ఫేజ్ కరెంట్ ఇవ్వడం ద్వారా ఇబ్బందులుండవన్నారు. గృహాలకు కరెంట్‌తో పాటు చిన్న పరిశ్రమల ఏర్పాటుకు ఉపయోగపడుతుందన్నారు. అనంతరం 15వ ఆర్థిక సంఘం, మున్సిపల్ సాధారణ నిధులు రూ.33.40 లక్షల అంచనా వ్యయంతో పట్టణంలో 27వ వార్డు నుంచి పంగిడి రోడ్డు పడమరవైపు డాక్టర్ ప్రసాద్ హాస్పిటల్ రోడ్డు నుంచి 28వ వార్డు నేతాజీ రోడ్డు వరకు చేపట్టిన స్టారమ్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణ పనులను మంత్రి దుర్గేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్‌కే వజీరుద్దీన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బంక్ కొడితే అడగండి!

- పెట్రోల్ బంకుల్లో వసతులు ఉచితం
- మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం తప్పనిసరి
- లేకుంటే ఫిర్యాదు చేయవచ్చు



వాహన టైర్లకు ఉచితంగా గాలి పెడుతున్న సిబ్బంది

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరలు సెంచరీ దాటాయి. వీటి ధరలు పెరిగినప్పుడల్లా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పన్నులపై ప్రజల్లో చర్చ సాగుతుంటుంది. ప్రతి లీటరుపై వ్యాట్ రూపంలో చెల్లిస్తున్న రుసుంతో వినియోగదారులకు బంకుల్లో యజమానులు సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ఈ సౌకర్యాల గురించి చాలా మందికి తెలియదు. ఒకరిద్దరు నిబంధనల గురించి ప్రశ్నిస్తే నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారనే విమర్శలు ఉన్నాయి. పెట్రోల్ బంకుల వద్ద వినియోగదారులకు సదుపాయాలు లేకపోతే అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో 23 ఉండగా, రూరల్ పరిధిలోని చాలా పెట్రోల్ బంక్‌ల్లో ఈ సేవలు కానరావడం లేదు. కొన్ని బంక్‌ల్లో టాయిలెట్లకు తాళాలు వేసి ఉంటున్నాయి. మరికొన్ని చోట్ల గాలి యంత్రాలు పనిచేయడం లేదు. పెట్రోల్ కొట్టించుకున్న తరువాత గాలి పెట్టించుకోవాలంటే సిబ్బంది లేరని సమాధానం చెబుతున్నారు. జిల్లాలో వివిధ కంపెనీలకు చెందిన 183 పెట్రోల్ బంక్‌లు ఉన్నాయి. బంక్‌ల వద్ద స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉంచాలి. అది చాలాచోట్ల కానరావడం లేదు.

ఇవి ఉండాల్సిందే..

స్వచ్ఛ భారత్‌లో భాగంగా అన్ని బంకుల్లో వాహనదారులు, ప్రజల సౌకర్యార్థం శుభ్రతతో కూడిన మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉండాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. వీటిని పలుచోట్ల ఏర్పాటు చేసినా వినియోగదారులను నిర్వాహకులు అనుమతించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. చాలాచోట్ల అసలు మరుగుదొడ్లు కనిపించని పరిస్థితి. బంకుల్లో ఇలాంటి సౌకర్యాలు లేకపోతే పెట్రోలియం సంస్థలకు ఫిర్యాదు చేయవచ్చు. లీటరు పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేస్తే అందులో మనం బంక్‌లకు నాలుగు నుంచి ఎనిమిది పైసల వరకూ మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణకు చెల్లిస్తున్నామని గుర్తించుకోవాలని అధికారులు అంటున్నారు.

ఆపద వేళ ఫోన్ సదుపాయం

అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ వినియోగించుకునే సదుపాయం బంకుల్లో ఉండాల్సిందే. మీరు వెళ్లే మార్గంలో ఏదైనా సమస్యల్లో చిక్కుకుంటే మీ వద్ద మొబైల్ ఫోన్ అందుబాటులో లేకపోతే భయపడాల్సిన పనిలేదు. ఏదైనా పెట్రోల్ బంక్‌ను సందర్శించడం ద్వారా మీరు ఏ నంబర్‌కైనా కాల్ చేసుకోవచ్చు.

నాణ్యతా ప్రమాణాలు తెలుసుకోవచ్చు

పెట్రోల్, డీజిల్ నాణ్యతా ప్రమాణాలు తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉంటుంది. పెట్రోల్, డీజిల్ నాణ్యతా ప్రమాణాలు తెలుసుకునే సదుపాయాన్ని బంకుల యాజమాన్యాలు అందుబాటులో ఉంచాలి. పెట్రోల్, డీజిల్ తక్కువగా వస్తుందని అనుమానం వస్తే వినియోగదారులు అక్కడికక్కడే పరీక్షించుకోవచ్చు. క్వాలిటీ చెక్ టిష్యూ పేపర్‌ను యాజమాన్యం అందుబాటులో ఉంచాలి. నోటీసు బోర్డులో సంబంధిత ఆయిల్ కంపెనీ సేల్స్ ఆఫీసర్ నంబర్‌ను ప్రదర్శించాలి.

గాలి ఉచితంగానే...

వాహనాల టైర్లలో గాలి నింపడానికి, గాలి శాతం తనిఖీ చేసుకోవడానికి అనువుగా బంకుల్లో కచ్చితంగా యంత్రాన్ని అందుబాటులో ఉంచాలి. గాలి నింపేందుకు ఒక వ్యక్తిని నియమించాలి. బంకుల్లో పెట్రోలు, డీజిల్ కొనుగోలు చేయకున్నా, వాహనదారులు కోరితే టైర్లలో గాలి తనిఖీ చేయాలి. ఇటీవల వాహనాల టైర్లలో సాధారణ గాలికి, ప్రత్యామ్నాయంగా నైట్రోజన్ నింపుతున్నారు. ట్యూబ్‌లెస్ టైర్లు వస్తున్నాయి. వాటిల్లో నైట్రోజన్ నింపాలి.

ప్రథమ చికిత్స కిట్ ఉంచాలి

ప్రతి బంక్‌లో ఫిర్యాదు పెట్టె, రిజిస్టర్‌ను అందుబాటులో ఉంచాలి. అందులో వినియోగదారులు తమ ఫిర్యాదులను నమోదు చేయవచ్చు. ప్రథమ చికిత్స కిట్ ప్రతి బంక్ వద్ద ఉండాలి. ప్రజలకు అవసరమైనప్పుడు వాటిని ఉపయోగించుకునే వీలుంటుంది. ఈ ప్రథమ చికిత్స పెట్టెలో ఆరోగ్యాన్ని రక్షించే మందులు ఉండాలి. దీంతో పాటు అన్ని మందులపై గడువు తేదీ రాసి ఉంచాలి. పాత మందులు ఉంచకూడదు.